# (అ)ధర్మం!

-డా॥ ద్వా.నా.శాస్త్రి



'దేవానందం మనసు ఉప్పొంగిపోతోంది.

తనిప్పుడు వెంకట్రావును కలవటానికి వెళ్తున్నాడు.

లోకంలో వెంకట్రావులు చాలా మంది ఉండవచ్చు. దేవానందం కలవబోయే వెంకట్రావు వేరు.

దేవానందం క్లాసుమేటనీ, రూమ్‌మేటనీ చెప్పినంతమాత్రాన వారి బాంధవ్యాన్ని చెప్పినట్టుకాదు. 'ప్రాణస్నేహితులు' అనే పదమే వీళ్ళకి నప్పుతుంది.

పైగా ఇప్పుడు వెంకట్రావు మామూలు వెంకట్రావుకానేకాదు--

మంత్రి హోదాలో వున్న వెంకట్రావు.

అట్టువంటి వెంకట్రావును కలుసుకోవటానికే వెళ్తున్నాడు దేవానందం.

గత అయిదేళ్ళుగా ఒకళ్ళకొకరు కలుసుకో వటంలేదు. ఉత్తరాలు మాత్రం నడుస్తు న్నాయి.

మంత్రికాగానే అభినందిస్తూ రాసిన ఉత్తరానికి యమ సిన్సియర్‌గా థాంక్స్ చెప్తూ రాశాడు కూడా.

అంతటి 'మిత్రశ్రీ' వెంకట్రావును కలవడానికి వెళ్తున్నాడు.

ఎంత తొందరగా కలుద్దామా అని ఉవ్విళ్ళూరుతున్నాడు.

ముందుగా 'పి.ఎ' ని కలవమంటే కలిశాడు



"ఇప్పుడు కుదరదండీ, ముందుగా ఎప్పాయింట్‌మెంట్ తీసుకోవాలి" అన్నాడు.

"మీకు తెలీదు సార్. మే మిద్దరం చాలా క్లోజ్.. దయవుంచి ఫోన్‌లో మీరు మీ ఫ్రెండ్ దేవానందంవచ్చాడని చెప్పండి చాలు వెంటనే పిలుస్తాడు."

"ఇప్పుడు సెక్రటరీతో అర్జెంటు విషయాలు మాట్లాడుతున్నారు."

"ప్లీజ్ ఒక్కసారి ఫోను చేసి చెప్పండి- మిమ్మల్ని ఏమీ అనడు" అని ప్రాధేయపడగా పడగా ఫోనుచేశాడు పి.ఎ.

"ఏమన్నాడు?" ఆదుర్దాగా అడిగాడు దేవానందం.

"చెప్పానుకదండీ..... అర్జంటుపనిలో ఉన్నారని. ఒకగంట ఆగమన్నారు..... ఇక్కడే కూర్చోండి.... మిమ్మల్ని జాగ్రత్తగా చూడమని చెప్పారులెండి."

ఆ మాటలకి దేవానందం గర్వించాడు. ఫ్రెండ్ అంటే అలాగుండాలని మళ్ళీ అనుకున్నాడు. మంత్రి అయినా సరే స్నేహాన్ని మర్చిపోతాడా? పి.ఎ. తెప్పించిన కూల్ డ్రింక్ తాగాడు.

గంటయింది. ఈ సారి మంత్రిగారే ఫోను చేసి లోపలికి రమ్మనటంతో దేవానందం సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ఎ.సి ఛాంబర్‌లోకి డోర్ తీసుకుంటూ వెళ్ళాడు దేవానందం.

దేవానందం ఇంద్రలోకంలో అడుగుపెట్టినట్టు ఫీలయ్యాడు.

చిన్నప్పటి 'వెంకుగాడు' దేవేంద్రుడిలా వెలిగిపోతున్నాడు.

వెంకట్రావు స్వయంగా వచ్చి కౌగిలించుకొని చూపించిన ఆదరానికి ఉక్కిరి బిక్కిరై పోతున్నాడు.

వద్దన్నా వినకుండా మరీ కూల్ డ్రింక్ ఇప్పించాడు.

తనతో మాట్లాడే తీరిక లేకుండా ఫోన్‌ల మీద ఫోన్లు వస్తున్నాయి.

ఆ ఫోనుల్లో మాట్లాడుతున్నప్పుడు వెంకట్రావు హావభావాలు చూడవల్సిందే.

"ఇది నిజమా? కలా?" అనుకొన్నాడు దేవానందం.

తెలుగు కాంపోజిషన్ నాచేత రాయించుకున్న వెంకట్రావేనా?

హోమ్‌వర్క్ చెయ్యకుండా నా పుస్తకం చూపించిచేసినట్టుగా అబద్ధమాడిన వెంకట్రావేనా?

రికార్డ్ పుస్తకంలేనందుకు సస్పెండైన ఆ వెంకట్రావేనా?

ఎలక్షన్ రమేష్ గాడితో తన్నులు తిన్న అప్పటి వెంకట్రావేవీడు అంటే దేవానందం మనసు అంగీకరించటంలేదు.

"ఏమిట్రా, మాట్లాడవే" అన్న అరుపులాంటి పిలుపుతో ఆలోచనా స్రవంతికి అడ్డుకట్ట పడింది.

పిచ్చాపాటీ అయిన తర్వాత------

"గోల్డ్ మెడలిస్ట్ అయిన మీ అబ్బాయికి ఉద్యోగంలేదన్నావుగానీ- ఇప్పించమని అడగవేరా? నీ బుద్ధే అంత. స్కూల్లో నా నోట్సులన్నీ రాసి పెట్టింది నువ్వేగదరా! నువ్విచ్చిన నోట్సులవల్లే గదరా నేను ప్యాసయింది. మా సెక్షన్‌లో ఉద్యోగం ఖాళీవుంది. మీ వాడ్ని అప్లయి చెయ్యమను ఇస్తాను."

అని అనటమేకాదు. పి.ఎ. ని పిలిచి అంతా చెప్పి నా అడ్రసురాసుకో మన్నాడు. 'ఓ వారంలో కనిపించు' అని మళ్ళీ కౌగిలించుకొని ప్రేమగా వీడ్కోలు చెప్పాడు.

ఒక వారం గడిచింది.

వెంకట్రావుని కలుద్దామని దేవానందం వెళ్ళాడు. వెంకట్రావు క్యాంపుకెళ్ళాడని- వారందాకా రాడని చెప్పారు. వెంకట్రావు అసిస్టెంట్ పి.ఎ. ని కలిసాడు, దేవానందం.

"ఆ ఉద్యోగం కుడిభుజంగా ఉన్న రమేష్ గారి బంధువుకి ఇచ్చారు సార్" అన్నాడా అసిస్టెంట్ పి.ఎ.

"అదికాదు---- ఆరోజు పి.ఎ. ని పిలిచి అన్నీ చెప్పారు గదా" నసిగాడు దేవానందం.

"అవి మాకు మామూలే సార్. మంత్రిగారికి ఇష్టంలేని వన్నీ అలా మాకు చెప్పి అడ్రసులు రాసుకోమంటారు అంతే-----"

దేవానందం తన కొడుక్కి ఉద్యోగం ఇప్పించనందుకు బాధపడలేదు- చిన్నప్పుడు రౌడీ రమేష్ చేత తన్నులు తిన్న వెంకట్రావుకి ఆ రమేష్ కుడిభుజమైనందుకు- అతగాడి బంధువుకి ఉద్యోగం ఇచ్చినందుకు మాత్రమే దిగులు చెందాడు. ❞

